కథ

-కొండూరి రామరాజు

# పిసరంత మనసు

**అమావాస్య రాత్రది. ఆకాశం మేఘావృతమై ఉంది. దానికితోడు కరెంటు కూడా పోయి చీకటితో కల్సిపోయింది. ప్రస్తుతం అక్కడ పెనుచీకటి రాజ్యమేలుతోంది.**

**అలాంటి వేళ అతను ఆఫీసు నుంచి ఊరుకొనసనున్న గెస్టు హౌస్‌కి అటువైపుగా వెళ్తున్నాడు. ఆమె ఇంట్లోంచి పారిపోతూ శరవేగంగా పరుగెడుతూ ఇటువైపుగా వస్తోంది. గడియారంలో చిన్నముల్లుని పెద్దముల్లు తనలోకి పూర్తిగా ఇముడ్చుకుంటున్న సమయంలో- ఆ సన్నని బాట మీద వాళ్లిద్దరూ భళ్లున గుద్దుకొని లుంగచుట్టుకొని పడి పోవడం కేవలం యాదృచ్ఛికం.**

అనుకోని ఆ పరిణామానికి ముందుగా తేరుకున్న అతడు తడిమి తడిమి చూశాడు. చెమటతో తడిసి ముద్దయిన మెత్తని గుండెల మీద పడిన అతని కుడిచేతి అరచేయి ఎగిసి ఎగిసి పడుతున్నట్టుగా గ్రహించాడు. ఇంకేమీ ఆలోచించకుండా సొమ్మసిల్లిన ఆ శరీరాన్ని అలాగే భుజాన్నేసుకొని నాలుగడుగులు దూరంలో ఉన్న తన రూములోపలకొచ్చి మంచం మీద పడుకోబెట్టాడు. వెలిగించిన క్రొవ్వొత్తితో వచ్చి చూస్తే ఏముంది!! ఆ వెలుగులో ఇరవైయ్యేళ్ల అందమైన ఆడపిల్ల వాగునీటిలో చలించిపోయే చందమామలా వణికిపోతోంది.

అతను చేసిన సపర్యలకి త్వరగానే తేరుకుందామె. మంచం దగ్గరే నిలబడి సన్నని వెలుగులో తననే చూస్తున్న అతడిని చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడింది!

''భయపడకండి! నన్ను మనోహరం టారు'' ఆమె భయాన్ని పోగొట్టి నెమ్మదిగా మాటల్లోకి దింపాలనే ఉద్దేశ్యంతో తనకు తానుగా పరిచయం చేసుకుంటేనే ''మరి మీ పేరు చెప్పరా?'' చంటిపిల్లని నీ పేలేంత్తమ్మా అని అడిగినట్టుగా అడిగాడు.

''కో...కో...కోమలి'' నత్తినత్తిగా జవాబిచ్చింది ఆమె ఇంకా పూర్తిగా వాస్తవంలోకి రాలేదనుకొని ''కోమలన్నమాట... కోమలి... బావుంది... అచ్చంగా మీరు అలానే ఉన్నారు'' నవ్వుతూ అన్నాడు మనోహర్.

మనోహర్ మాట తొలకరి చినుకై మీద పడినట్టుగా పులకరించిపోయింది కోమలి. రూపు, మాట ఆ పేరులాగానే బావున్నాయనుకుంది. అతని స్వరానికి స్పర్శించి లాలించే గుణం కూడా ఉందనుకుంది. గాఢాంధకారంలో నిశ్చలంగా నిలబడి వెలుగుతున్న ఆ గదిలో దీపం అంత అందంగా కనిపించాడామె కంటికి మనోహర్. ఆమె అనుకున్నదంతా నిజమంత నిజం. మనోహర్ నిజంగా మనోహరుడే!

పరుగెట్టుకొచ్చిన గస పూర్తిగా తగ్గి నెమ్మదిగా ఉంది. లేచి కాళ్లను నేలమీదకు ఆన్చి మంచంమ్మీద కూర్చున్న కోమలి పూర్తిగా మనిషయ్యింది. ఇప్పుడామె ముఖం ప్రశాంతంగా ఉంది. అది గమనించి-

''ఇంత చీకటి రాత్రిలో.. ఒంటరిగా.. ఎక్కడికా పరుగు? చావడానికా?'' ప్రశ్నను ఆపి ఆపి మామూలుగా అడుగుతున్న మనోహర్ వంక అంతే మామూలుగా చూసిన కోమలి ''మానం కాపాడుకొనే ప్రయత్నంలో పరుగెత్తిన మాట నిజం. అలా పరుగెట్టే పరుగెట్టే ఎక్కడ నా కాళ్లు ఆగిపోతాయో అక్కడే నిలబడి బతకాలనుకున్నాను'' అంటూ ''మీకో విషయం చెప్పనా?'' అంది.

ఏమిటన్నట్టుగా చూశాడు మనోహర్ కోమలి వంక.

''పుట్టి పెరిగింది చచ్చిపోడానికి కాదు బతకడానికి. బతకాలి.. సుఖమో దుఃఖమో, కష్టమో నష్టమో ఏదైనప్పటికీ భరించి ఎదురీది బతకాలి. తనకు తానుగా మరణం వచ్చే వరకు బతుకుతూ ఉండాలన్నదే నా ఆశ. అంతేగానీ పిరికితనంతో చావుకి సిద్ధపడకూడదని నేనెప్పుడో నిర్ణయించుకొన్నాను'' తనలో ఉన్నది ఉన్నట్టుగానే చెప్పేసింది కోమలి.

మనోహర్‌కి కోమలన్న ప్రతీ మాటకీ రెక్కలొచ్చి మనసుమీద వాలినట్టనిపించింది. ఆమె తీసుకున్న నిర్ణయం ఇంకెంతిష్టంగా తోచిందో! ఎంతిష్టమంటే- ఇష్టమంత ఇష్టం. ఆ ఇష్టానికి సర్వం మర్చిపోయి, మైమర్చిపోయి తప్పట్లు కొట్టటం మొదలుపెట్టి ఇంకా కొడుతూనే ఉన్నాడు మనోహర్.

అలా వెర్రిగా అతనెందుకు తప్పట్లు కొడ్తున్నాడో అర్థం కాక ''ఎందుకా తప్పట్లు?'' ఆశ్చర్యపోతూ అడిగింది కోమలి. వెంటనే వర్తమానంలోకి వచ్చిన మనోహర్ తప్పట్లాపించేసి ''మీరిప్పుడు తీసుకొన్న నిర్ణయం మర్చిపోయిన నా కథను జ్ఞప్తికి తెచ్చింది. అందుకు ఆనందం పట్టలేక. అది ఒక కథలెండి'' యధాలాపంగా అన్నాడు మనోహర్.

భుజాల మీదకి గుర్రం ఎక్కించుకొని ''బొబ్బుంటావా! కథ సెపుతాను'' అంటూ గుండెలమీదకు దిగిన ఆ లేతపాదాలను చేతుల్తో మెత్తగా పట్టుకుని చుక్కలాకాశం కింద, నిండు చందమామ కింద తిప్పుతూ వాళ్ల నాన్న చెప్పిన కథలు గుర్తుకు వచ్చి ఇంకా అదే జ్ఞాపకంలో ఉండిపోయి ''మీ కథ చెప్పరా?'' పసిపాపలా అడిగింది కోమలి.

ఆమె అడిగిన తీరుకి ముగ్ధుడై కొంతలో కొంతైనా ఆమె నిర్ణయానికి తన కథ ఊతమిస్తుందనే నమ్మకంతో చెప్పడం మొదలుపెట్టాడు మనోహర్.

''అన్ని హంగుల్తో హాయి హాయిగా సాగిపోయే ఓ చిన్న పరిమిత కుటుంబం మాది. అమ్మా నాన్న, ఇద్దరక్కలు, నేను. వేర్వేరు పట్టణాలలో హాస్టల్లో ఉంటూ ఇద్దరక్కలు ఇంజనీ

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథల పోటీలో ఎంపికైన రచన**

రింగ్ చదువుతుంటే - నేను ఫస్ట్ ఇంటర్ చదువుతున్నాను.

గోదావరి ఒడ్డున జరిగే గార్డెన్ పార్టీకి ఫలానా రోజున రమ్మనమని మా అక్కల్తోబాటు నాకు మా నాన్నగారి నుండి ఉత్తరం వచ్చింది. అనుకున్న రోజుకి అందరం జేరుకున్నాం. పార్టీ కులాసా కులాసాగా సాగుతున్న సమయంలో సర్దాగా గోదావరి స్నానాలు చేద్దాం అన్న నాన్నగారి ప్రపోజల్‌కి మేమంతా 'ఒకే' అన్నాం.

అందరం కట్టకట్టుకునే నదిలోకి దిగాం. కొంచెం ముందుకు.. ఇంకొంచెం ముందుకు అంటూ మమ్మల్ని ఉల్లాసపరుస్తూ నడిపిస్తున్నారు నాన్న. అంతే! అందరం లోతున్న వడిలోకి దిగిపోయాం. కొంచెం దూరంలో ఉన్న జాలర్లు వలలు పట్టుకొని కేకలేసుకుంటూ మా వద్దకు రావడం మాత్రం జ్ఞాపకం ఉంది నాకు.

ఆ మర్నాడు ఆసుపత్రి బెడ్ మీద మెలకువలోకి వచ్చిన నాకు మా వాళ్లందరూ శవాలుగా దొరికారన్న వార్త తెలిసి మనసంతా ఒక్కసారిగా బ్లాక్ అయిపోయింది. దుఃఖం గడ్డికట్టేసి కన్నీళ్లు రావడం మానేశాయి.



లక్షలాది రూపాయల అప్పుల్లో కూరుకుపోయిన మా నాన్న మా చదువులు, అక్కల పెళ్లిళ్లు, కుటుంబ పరిస్థితులు ఊహించుకుని అప్పుల వాళ్లకు భయపడి, సమస్తం అప్పులోళ్లకిచ్చేసి దారుణానికి వడిగట్టినట్టుగా పోలీసులకు రాసిన ఉత్తరం ద్వారా తెలుసుకున్నాను. దాయాదులు, బంధువులు, స్నేహితులు ఆ నిమిషంలోనే నా కళ్ల ముందర నుంచే జారిపోయారు.

అదే గోదారి ఒడ్డున నా కుటుంబ దహన సంస్కారాలకి ఎవరు పుణ్యం కట్టుకున్నారో తెలియదు గానీ వాళ్లొచ్చి కాటికాడికి తీసుకెళ్లారు. చిన్న స్టేజిలాగ పేర్చిన ఏక చితిమీద అమ్మానాన్ననీ, అక్కల్దిదర్నీ పక్కపక్కనే వరుసగా పడుకోబెట్టి ఉంచారు.

ఏ రంగస్థలం మీద నాటకాలాడారో, అదే రంగస్థలం మీద బతకలేక బతుకులు వెల్లదీసుకుని లోకానికి నిరసన తెలియజేస్తున్న కళాకారుల్లా పడుతున్న మా వాళ్లను కడసారిగా చూసుకుంటే- నా కళ్లమ్మట రాలిపడిన రెండే రెండు కన్నీటిచుక్కలు బలంగా భూమ్మీద పడిన చోట సొట్టలు పడింది నేల.

నీటి ధారపడుతున్న కుండతో చితిచుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇప్పుడు మీరనుకున్న మాటల్నే అచ్చంగా అక్షరం పొల్లుపోకుండా అనుకుంటూ కుండబద్దలు కొట్టేసే బతకాలనే నిర్ణయాన్ని గట్టిగా నిర్ణయించుకుని చితికి నిప్పంటించి వెనుదిరిగి చూడకుండా వచ్చేసి మళ్లీ ఇప్పటివరకూ మా ఊరిముఖం చూడలేదు.

ఆ వచ్చేయడం వచ్చేయడం వచ్చేసి ఒక చోట ఆగిపోయాను. ఎక్కడ పని దొరికిందో అక్కడ పన్జేశాను. ఎప్పుడు తిండి దొరికితే అప్పుడు తిన్నాను. ఎక్కడైతే నిద్రొచ్చిందో అక్కడే పడుకున్నాను. సుకుమారమైన నా శరీరాన్ని రాటుదేల్చేసుకున్నాను. పగలల్లా పని. రాత్రల్లా చదువు పచ్చికొట్టేసిన చదువుతో మళ్లీ జతకట్టేశాను. లోకాన్ని ద్వేషించకుండా ప్రేమిస్తూ ఇష్టంగా బతకడం నేర్చుకున్నాను. చివరకు ఆ ప్రయత్నమే నన్నొక 'ఆడిటర్'ని చేసింది. ఇక్కడున్న గవర్నమెంటు ఆఫీసులో లెఖ్ఖల్ని తనిఖీ చేసే నిమిత్తం హైదరాబాద్ నుంచి రెండు రోజుల క్రితం రావల్సి వచ్చాను''

ముద్దకట్టిన విషాదపు కథను ఎత్తుగడ నుంచి ముగింపు వరకూ నిబ్బరంగా చెప్పిన మనోహర్ ముఖంలో ఎలాంటి మార్పులు కనపడకపోవడం కోమల్ని ఆశ్చర్యపరచింది. ఆచరించవలసిన కథనుకుంది. లోకాన్ని ద్వేషించకుండా ప్రేమిస్తే? ప్రేమిస్తే?? దుర్మార్గుల పనిని కాలం చూసుకుంటుంది. ఆ శక్తి కాలానికుందనుకొని నమ్మిన కోమలి ''నీ కథే నాకు

స్ఫూర్తి'' మనోహర్‌తో అంది కోమలి.

కోమలిచ్చిన సర్టిఫికెట్‌కి అతని మనసు రవ్వంత సేపు పొంగిన మాట నిజమే గానీ వెంటనే తలవొంచేసుకున్న మనోహర్ వంక ఆశ్చర్యంగా చూసింది కోమలి. ఎదుటివారి నుంచి ప్రశంస వస్తే మనోహర్ అలానే చేస్తాడు అది అతనికొక అలవాటు. ఆ విషయం కోమలికి తెలియదు. కోమలి చీకటి పరుగు వెనుకున్న కథను తెలుసుకోవాలనుకున్న మనోహర్ ఆసక్తి అలానే ఉండిపోయి చివరకు అడిగితే-

''అదొక దిక్కుమాలిన కథ.. నీతిమాలిన కథ.. సిగ్గుమాలిన కథ... చెప్పడానికే సిగ్గుపడే కథ. వద్దులెండి'' అంది కోమలి.

''అయితే నేను వినాల్సిందే మీరు చెప్పాల్సిందే'' ఇది నా ఆజ్ఞ అన్నట్టుగా అడిగాడు మనోహర్.

అతి పిన్నవయస్సులో అనుభవం పండించుకున్న ఈ వ్యక్తి దగ్గర ఆగిన తన పరుగుకి ఇక్కడే.. ఇక్కడే.. తన సమస్యకు ఒక పరిష్కారం దొరుకుతుందేమోనన్న ఆశతో సిగ్గును పక్కన పెట్టేసి తన కథను చెప్పడం మొదలుపెట్టింది కోమలి.

''నాకు పదేళ్లున్నప్పుడు మా నాన్న పోయాడు. వయసులో ఉన్న మా అమ్మకు మగతోడు అవసరమైందో, ఆసరాకు అవసరమనుకుందో ఏమో తెలియదు గానీ నాతో బాటు ఆ ఊరతనితో వచ్చేసింది. అతని ముందు భార్య ఎవడితోనో లేచిపోయిందట. అతను బావుంటాడు. మా అమ్మ ఇంకా బావుంటది. నాది మా అమ్మ పోలిక. పని పాటలకెళ్తూ చదువుకుండే నేను ఓ రోజున పెద్దమనిషినయ్యాను. అప్పటి నుండి ఇప్పటి వరకు మనసుకు కుదురు కంటికి కునుకు లేకుండా పోయింది.

రాత్రని గానీ, పగలని గానీ తేడా లేకుండా నా కళ్లముందరే అమ్మను తీసుకొని గదిలోకెళ్లి మంచం ఎక్కేసేవాడు. గదిలోంచి వచ్చి నన్ను చూసి అదోలా నవ్వేవాడు. దగ్గరకు పిల్చి ఒళ్లో కూర్చోమనేవాడు. బుగ్గలు గిల్లి ముద్దులు పెట్టేవాడు. గుండెల మీద, తొడల మీద చేతులేసేవాడు.

అతని చర్యలకి గొంగళి పురుగులు దండుగా వచ్చి నా మొత్తం ఒంటిమీదనే కాకుండా లోలోపల ఎక్కడెక్కడో ముళ్లులు విరిసేసి నంత బాధ కలిగి విలవిల్లాడిపోయేదాన్ని. నా సవతి తండ్రి దృష్టిలో అమ్మ నేను ఒకటేనని నేను గ్రహించేటప్పటికే అతని వ్యవహారం చాలా చాలా దూరం వచ్చేసింది.

ఓ రోజున జరుగుతున్నది జరుగుతున్నట్టుగా చెబితే ఆమె ఏమందో తెలుసునా! నీ మీద తండ్రి ప్రేమే తప్ప మరోటి కాదని నా మాటను కొట్టిపారేసింది. మా అమ్మ వాణ్ని ఎంతగా నమ్మిందో నాకా క్షణంలో తెలిసింది. మా అమ్మకు మగాడి ఆసరా కంటే మగతోడే అవసరమని కూడా అప్పుడే అర్థమైంది.

రాత్రి ఆ మానవ మృగం బారి నుంచి ఎలా తప్పించుకోవాలో మార్గాలు కోసం అన్వేషిస్తుంటే - మూగన్నుగా నిద్ర పట్టేసింది. సరిగ్గా అప్పుడే పీకల దాకా తాగిన నా సవతి తండ్రి చప్పుడు లేని చలిపిడుగులా వచ్చి మీద పడ్డాడు''

కథను ఆపుచేసింది కోమలి.

బలమైన ఈదురుగాలి గదిలోకి జొరబడి వెళ్తూ వెళ్తూ దీపాన్నార్పేసి తలుపులన్నింటిని భడేల్మని మూసేసి వెళ్లిపోయింది. ఆకాశం భోరున కురవడం మొదలుపెట్టింది.

మనోహర్ లేచి వచ్చి క్రొవ్వొత్తి వెలిగిస్తుంటే ''అంత కర్ణకఠోరంగా ఉందా నా కథ, చెప్పరే'' అంది కోమలి.

''ఇప్పుడే వచ్చి వెళ్లిన గాలి.. ఆ ఆకాశం ఇంత వివరంగా చెప్తుంటే నే చెప్పేదేముంది'' తన అభిప్రాయాన్ని తెలివిగా చెప్పిన మనోహర్ లోలోపల ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

కోమలిలోని మొండితనం అంతకుమించిన పసితనం మనోహర్ని ఆకర్షించి, ఇలాంటి పిల్లలకు సవితి తండ్రి నీడ పడకుండా చేయాలంటే? ఆలోచించి చివరకు ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి వచ్చిన మనోహర్ ''చూడండి కోమలీ! మీరు నా మార్గం మీద నడుస్తున్న మనిషి. చిత్రంగా అలాగే కలుసుకున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే - ఇద్దరమూ ఒక జాతి పక్షులం. అంచేత ఒకే గూటిలో ఉంటే తప్పేంటి?'' తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పకుండా తెలియజేశాడు మనోహర్. ఒక నిమిషం తరువాత ''తప్పులేదు'' అలాంటి సమాధానమే కోమలి నుంచి వచ్చింది.

కరెంటు రావడంతో చీకటి పక్కకు తప్పుకొంది.

★ ★ ★

అద్భుతంగా తెల్లవారింది.

కోమలి తన తల్లి, సవతి తండ్రి దగ్గరకొచ్చి తను మనోహర్ పెళ్లి చేసుకుంటోన్న విషయాన్ని చెప్పి వెళ్తుంటే - కలో నిజమో అన్న సందిగ్ధంలో పడిన కోమలి తల్లి ఆనందమో బాధో తెలియదు గానీ, కంట నీరు పెట్టుకుంటే- సవితి తండ్రి మాత్రం కోమలి దొరకలేదని బాధపడ్డాడు.

రెప్పపాటులో ఒక సంవత్సర కాలం గిర్రున తిరిగిపోయింది.

ఓ రోజు సాయంకాలం రోడ్డుమీద కనపడ్డ కోమలి సవితి తండ్రికి ''మీ ఇంటికి కవరొచ్చిందండి'' అంటూ ఉత్తరాల సంచిలోంచి ఒక కవరు తీసి అతని చేతికి అందించి వెళ్లిపోయాడు పోస్టుమాన్.

భార్యమీద అనుమానపడుతూ కవర్ని చింపి చూస్తే అది కోమలి నుంచి వచ్చింది.

''అమ్మా! మాకిప్పుడు ఓ బాబు. మొన్ననే మూడో నెల వచ్చింది. వాడికి నాన్నగారి పేరే పెట్టుకొన్నాం. ఆశీస్సులందిస్తారని తలుస్తున్నాను. ఇట్లు.. మీ కూతురు.. కోమలి''

ఉత్తరాన్ని మళ్లీ మళ్లీ చదివాడు. ఎన్నెన్నో సార్లు చదివాడు. ఇంకా చదువుతూనే అప్పుడనుకొన్నాడు మనసులో. 'నేను ఆమె పట్ల పశు నీతిని ప్రదర్శిస్తే తన బిడ్డకు నా పేరు పెట్టుకొని నన్ను నిలబెట్టింది' ఒక్కసారిగా అతని మనసులో మెదిలిన కోమలి దేన్నో కెలికినట్లయింది.

రాత్రంతా ఇంటికి రాకుండా ఎక్కడెక్కడో తిరుగుతూ ఆ ఉత్తరాన్నే చదువుతూ అదే మాట తలుచుకుంటూ ఇంకా తిరుగుతూనే ఉన్నాడు.

తెల్లారేకా ఊరవతల తుమ్మ చెట్టుకు ఉరేసుకుని శవమై కనిపించాడతను అక్కడ జనానికి.

పోలీసులొచ్చి ఆ శవాన్ని దింపి చూస్తే 'నా చావుకి నేనే కారణం' సంతకంతో ఉన్న ఒక తెల్ల కాగితం అతని జేబులో దొరికింది.

నిజానికి కోమలి బిడ్డకి తన కన్న తండ్రి పేరు పెట్టుకుంది.

☆

